క్లుప్తంగా

ఘనంగా వెంకటేశ్వర కల్యాణం

ఎచ్చెర్ల,లావేరు: లావేరు మండలంలోని మురపాక గ్రామం ప్రతిభాభారతినగర్ కాలనీలో వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పలువురు దంపతులు కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులు అన్నదానం చేశారు.

ఇంటింటికీ మంచినీటి సరఫరా

ఎచ్చెర్ల: జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటిని సరఫరా చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతినిధులు అన్నారు. ఎచ్చెర్లలో శనివారం జలజీవన్ మిషన్ ద్వారా మంచినీటి సరఫరాకు సంబంధించి వెలుగు సిబ్బంది జూమ్‌మీటింగ్ నిర్వహించారు. ఏపీఎం రామ్మూర్తి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో గాయని నిఖితా శ్రీవల్లి



శ్రీవల్లికి జ్ఞాపిక అందజేస్తున్న కృష్ణమాచార్యులు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సినీ గాయని నిఖితా శ్రీవల్లి శనివారం ఉదయం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆమె ఆదిత్యున్ని స్మరిస్తూ అనివేటి మండపంలో పలు గీతాలు ఆలపించారు. అర్చకులు ఇప్పిలి షణ్ముఖ శర్మ, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

నేడు భగవద్గీత పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం గీతా జయంతి పురస్కరించుకొని నారాయణ తిరుమల వేంటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 10 గంటలకు భగవద్గీత పోటీలు నిర్వహిస్తామని ఆర్గనైజర్ ఎం.లలితామణి ఒక ప్రకటనలో తెలిపారు. మూడో అధ్యాయం కర్మయోగంపై శ్లోక కంఠస్థ పోటీలు మూడు విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా, చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో నారాయణ తిరుమలలో నాలుగో అధ్యాయంపై పఠన పోటీల ఫైనల్స్ జరుగుతాయని స్వామీ పరాత్మానంద సరస్వతి తెలిపారు. ఇప్పటి వరకు 28 స్కూళ్లలో 2500 మందికి పోటీలు నిర్వహించగా, 86 మంది తుది పోటీలకు అర్హత సాధించారని పేర్కొన్నారు. విజేతలు ఈ నెల 17న ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: పంజాబ్ రాష్ట్రంలోని చండీఘర్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే ఆలిండియా బాక్సిక్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక వర్సిటీలో నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టరాఫ్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల నాలుగో తేదీన ఉదయం పది గంటలకు ఎంపికలు చేపడతామని.. క్రీడాకారులు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

కిడ్నీ వ్యాధి నివారణకు కృషి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఉద్దాన ప్రాంతంలోని కిడ్నీ వ్యాధి నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లాకోర్టు సమావేశం మందిరంలో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, ఆర్డీఓ గణపతి, జిల్లా మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి, డీసీఎల్ ప్రసాదరావు, డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.చంద్రరావు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీరాములు, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ కె.విద్యాసాగర్, డిప్యూటీ సివిల్ అసిస్టెంట్ సర్జన్ భాను ప్రకాష్, డాక్టర్ ప్రవీణ్, రెడ్డి, ల్యాబ్స్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.సురేష్, నెఫ్రో కేర్ సెంటర్ మేనేజర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

రక్తదానంలో సురేష్ ఆదర్శం

రణస్థలం: పాతర్లపల్లి పంచాయతీ సూరంపేట గ్రామానికి చెందిన దివ్యాంగుడు నాజాన సురేష్ రక్తదానం చేయడంలో ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకూ 33 సార్లు రక్తదానం చేసిన ఈయన ఆదివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మరోసారి రక్తదానం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

ఉక్కు సత్యాగ్రహం చిత్ర యూనిట్ రాక

శ్రీకాకుళం: విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదంతో ఉక్కు సత్యాగ్రహం సినిమా యూనిట్ ప్రమోషన్‌లో భాగంగా శనివారం శ్రీకాకుళం చేరుకున్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శక, నిర్మాత సత్యారెడ్డి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా ఆంధ్రులంతా అడ్డుకోవాలని కోరారు.

13 నుంచి సుబ్రహ్మణ్య షష్టి వైభవోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని నాగావళి నదీ తీరంలో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో ఈ నెల 13 నుంచి 19 వరకు సుబ్రహ్మణ్య షష్టి వైభవోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు పెంట శ్రీనివాసశర్మ, కిరణ్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి

- క్లెయిమ్‌లు వెంటనే పరిష్కరించాలి
- బీఎల్‌ఓలకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశం



గార: విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

గార: పోలింగ్ కేంద్రాలకు వచ్చిన క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సిబ్బందికి సూచించారు. శనివారం గార జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఓటర్ల నమోదు, తొలగింపులపై బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. యువ ఓటర్లు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థుతో ముచ్చటించారు. ఓటు విలువ తెలుసుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని, తద్వారా మంచి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జెన్ని రామారావు తదితరులు పాల్గొన్నారు. శ్రీకాకుళం ఆర్‌డీవో రంగయ్య అంపోలు, రామచంద్రాపురం పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

శ్రీకాకుళం రూరల్: పెదపాడు సచివాలయం పరిధిలోని పలు పోలింగ్ బూత్‌లను తహశీల్దార్ ఎన్. వెంకట్రావు శనివారం పరిశీలించారు. బీఎల్‌వోలకు వచ్చిన ఫారం-6,7,8 దరఖాస్తుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఓటు వేయడంపై అవగాహన

రణస్థలం: ఓటర్లు తమ అమూల్యమైన ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో తప్పక తెలుసుకోవాలని తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్ అన్నారు. జె.ఆర్.పురం పంచాయతీ సీతంవలస గ్రామంలో ఓటు హక్కు వినియోగంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈవీఎంలు, వీవీప్యాట్ మెషీన్ల పని చేసే తీరును వివరించారు. 80 రోజుల పాటు ప్రతీ గ్రామంలో ప్రత్యేక వాహనం ద్వారా ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జి.కె. శ్రీనివాస్, వీఆర్వో లుకలాపు అప్పలనాయుడు ఉన్నారు.

బీఎల్వోలు అందుబాటులో ఉండాలి

ప్రత్యేక ఓటర్లదినోత్సవం సందర్భంగా బీఎల్వోలు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండాలన్నారు. 18 ఏళ్ల దాటిని వారంతా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సక్రమంగా ఓట్ల నమోదు

జి.సిగడాం: గ్రామస్థాయిలో నియమించిన బూత్ లెవల్ అధికారులంతా ఓటర్ల నమోదు ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని మండల అసిస్టెంట్ రిట్నరింగ్ అధికారి పప్పల వేణుగోపాలరావు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని 8, 9, 10, 11, 12 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలం పరిధిలో 63 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాను సంబంధిత బీఎల్‌వోల వద్ద ఉంచామన్నారు. వాటిలో ఓటు ఉన్నది , లేనిది ఓటర్లు సరి చూసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఎన్.నిర్మల, ఆర్ఐ రామచంద్రరావు, బూత్ లెవల్ అధికారులు భూపతి నర్సింగరావు, తులసీప్రసాద్ సాహు, గుణ, మన్మథరావు, మధులత ఉన్నారు.



శ్రీకాకుళం రూరల్:దరఖాస్తులను పరిశీలిస్తున్న తహశీల్దార్ వెంకట్రావు



రణస్థలం: ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది



జి.సిగడాం: ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న వేణుగోపాలరావు



రణస్థలంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కిరణ్ కుమార్

పలాసలో జీఎన్ జ్యూయలర్స్ ప్రారంభం



బంగారు నగలను పరిశీలిస్తున్న మంత్రి సీదిరి సతీమణి శ్రీదేవి, తదితరులు

కాశీబుగ్గ: ప్రముఖ నగల విక్రయ సంస్థ జీఎన్ జ్యూయలర్స్ నూతన షోరూమ్‌ను పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రారంభించింది. కాశీబుగ్గ బస్టాండ్‌కు సమీపంలో కేటీ రోడ్డులో నూతన షోరూం ప్రారంభోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సతీమణి సీదిరి శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరై బంగారు విభాగాన్ని ప్రారంభించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్ బళ్ల గిరిబాబు వెండి విభాగాన్ని ప్రారంభించారు. తమ సంస్థ మూడో షోరూంను ఇక్కడ ఏర్పాటు చేశామని నరసన్నపేట పట్టణానికి చెందిన ప్రముఖ బంగారు వ్యాపారవేత్త గుడ్ల నారాయణరావు తెలిపారు. ఇక్కడ ప్రతి కొనుగోలుపై కచ్చితమైన బహుమతులతో పాటు, లక్కీ డ్రాలో గెలిపొందిన వారికి ఎంత బంగారం కొంటే అంతే బంగారం ఉచితంగా ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.



కాశీబుగ్గలో జీఎన్ జ్యూయలర్ షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి సతీమణి సీదిరి శ్రీదేవి

ఎమ్మెల్యే పరామర్శ

ఎచ్చెర్ల/లావేరు: లావేరు మండలం గుమ్మడాం గ్రామానికి చెందిన ముప్పిడి రామారావు ఇటీవల అనారోగ్యంతో చనిపోయారు. దీంతో అతని కుటుంబ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముప్పిడి శ్రీరాములు, అమర్నాథ్‌లను ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ శనివారం గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట గుమ్మడాం పార్టీ నాయకులు దురగాసి ధర్మారావు, నాగం కనకరాజు, ముప్పిడి పురుషోత్తం, సిమ్మారావు, జగదీష్ ఉన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలానికి చెందిన పలువురిని ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ పరామర్శించారు. కొయ్యాంలో విశ్రాంత ఆర్ఐ మజ్జి రామకృష్ణ, చిలకపాలెంలో మెడికల్ షాపు యజమాని శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబాలను పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. నాయకులు మాడుగుల మురళీధర్‌బాబా, దొంక వెంకటరమణ, సన్యాసప్పడు, మజ్జి జగదీష్, పొత్సని రమణ ఉన్నారు.



ఎచ్చెర్ల: రామారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

ప్రజల్లోకి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ఎచ్చెర్ల క్యాంపస్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. డి.మత్స్యలేశం గ్రామంలో 'వై నీడ్స్ ఏపీ జగన్'కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రాత్రి పల్లెనిద్ర, సహఫంక్తి భోజనాల కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ప్రభుత్వ పథకాలు వివరించి, ప్రచార బుక్‌లెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలుపుంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామ స్థాయిలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముద్దాడ శంకర్, జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ అంబటి రాంబాబు, స్థానిక సర్పంచ్ మూగి ఈక్షిత, ఎంపీటీసీ చోడుపల్లి వలసమ్మ సచివాలయ సిబ్బంది ఉన్నారు.



రణస్థలం: డి.మత్స్యలేశంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ చిరంజీవి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రణస్థలం: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్ష సూచన ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పూరిళ్లు, మట్టి ఇళ్లలో ఉన్న వారు సురక్షిత ప్రాంతాలకు, తుఫాన్ షెల్టర్లకు వెళ్లాలని సూచించారు. రైతులు వరికుప్పలు, ధాన్యాన్ని జాగ్రత్త పరుచుకోవాలని, మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదన్నారు. అత్యవసర పరిస్థితులు ఉంటే గ్రామ సచివాలయం, తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు.

రక్తదానానికి ముందుకురావాలి

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రామలక్ష్మణా బ్రాంచ్ సౌజన్యంతో శ్రీసాయి దంత వైద్యకళాశాల, పరిశోధన సంస్థలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 51 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. విశాఖ జిల్లా సొంట్యాం నడింపల్లి సత్యనారాయణరాజు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కళాశాలలో 70 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కె.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డాక్టర్ అభిరామం, ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ మురుగన్ దాస్, బ్యాంకు సిబ్బంది ధవళ అవినాష్, బి.ఎస్.ప్రసాద్, రవిశంకర్, సత్యనారాయణ, పెంకి చైతన్యకుమార్, సాయిసుధాకర్, సుజాత పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

నేడు జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి సబ్-జూనియర్స్ బాలబాలికల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుంకరి కృష్ణకుమార్, ఎమ్మెస్సీ శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎంపికలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపికైన జిల్లా జట్లను ఈ నెల 8 నుంచి 10 వరకు గుంటూరు జిల్లా తెనాలి వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్-2023 పోటీలకు పంపిస్తామని తెలిపారు. వివరాలకు 94937 64447 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో వైద్య శిబిరం

శ్రీకాకుళం క్రైమ్ : జెమ్స్ అర్బన్ హెల్త్ సెంటర్ సౌజన్యంతో నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌జీవీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్డియాలజీ వైద్యులు డాక్టర్ ఆర్.రత్నం, డాక్టర్ అన్నెపు శశిధర్, డాక్టర్ నవీన్, సీసీటీఎస్ సీఐ బాబ్జీరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాదరావు

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎచ్చెర్ల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సురేష్‌కుమార్ అన్నారు. శనివారం లింగాలవలస గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సంక్షేమ పథకాల కోసం వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం మాధవీలత, ఏపీవో సత్యవతి, పంచాయతీ కార్యదర్శి రమణ, మాజీ సర్పంచ్ దాలినాయుడు ఉన్నారు.



మాట్లాడుతున్న సురేష్‌కుమార్

ఘనంగా కంప్యూటర్ అక్షరాస్యతా వారోత్సవాలు



వివిధ రాష్ట్రాల సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటానమస్) కళాశాలలో శనివారం అంతర్జాతీయ కంప్యూటర్ అక్షరాస్యతా వారోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. కళాశాల కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.సూర్యచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోడింగ్, డీకోడింగ్ అంశాలపై పట్టు సాధించాలన్నారు. ఐటీ ప్రొఫెషనల్ కె.మణికంఠశర్మ మాట్లాడుతూ మూడేళ్ల డిగ్రీతో పాటు వివిధ ఆన్‌లైన్ రీసోర్సెస్ కోర్సులను పూర్తి చేసి నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు వివిధ రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ వస్త్రధారణతో హాజరై ఆకట్టుకున్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకరనారాయణ, అకడమిక్ కో-ఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కంప్యూటర్ అధ్యాపకులు ఐ.శ్రీలక్ష్మి, ఎస్.మాధవీలత, ఎస్.వాణీకుమారి, జి.సుమలత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్ర

సంక్షిప్తంగా...

కమాండ్ కంట్రోల్ రూమ్ తనిఖీ

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌ను జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్) టి.పి.విఠలేశ్వరరావు శనివారం సందర్శించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉన్న కంప్యూటర్లను తనిఖీ చేశారు. గార ఎస్బీఐలో బంగారం మాయం కేసు అంశంపై ఆయన వద్ద ప్రస్తావించగా కేసు విచారణ జరుగుతుందని, ఆధారాలను సేకరిస్తున్నామని చెప్పారు. ఈయన వెంట రెండో పట్టణ ఎస్ఐ నాగిరెడ్డి లక్ష్మణరావు, శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్, రైటర్ సింహాచలం, కానిస్టేబుళ్లు వెంకటేష్, రమేష్ ఉన్నారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనలు


శ్రీకాకుళం కల్చరల్: బాపూజీ కళామందిర్‌లో రంగస్థల కళాకారుల నెలవారీ సాంస్కృతిక విభాగం 290వ నెల కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనల గానం అలరించింది. మల్లె మొగ్గల లక్ష్మీ వీనులవిందుగా కీర్తనలు ఆలపించారు. అనంతరం సత్యహరిశ్చంద్ర కాటిసీను ప్రదర్శన, కళాకారులకు నెలవారీ పింఛన్ల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ దండి పంకజాక్షదేవ్, అధ్యాపకులు డాక్టర్ ఎం.రామజోగినాయుడు, సమాఖ్య అధ్యక్షుడు చిట్టి వెంకటరావు, గౌరవ అధ్యక్షుడు ఎల్.రామలింగస్వామి, కార్యనిర్వాహక అధ్యక్షుడు పన్నాల నర్సింహమూర్తి, కార్యదర్శి బి.రామచంద్రదేవ్, రమణారావు, పైడి సత్యవతి, కంచరాన అప్పారావు పాల్గొన్నారు.



కీర్తనలు ఆలపిస్తున్న లక్ష్మీ

పోటీ పరీక్షలపై దృష్టిపెట్టాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు పోటీ పరీక్షలపై దృష్టిపెడితే మంచి అధికారులుగా ఎంపికై ప్రత్యక్షంగా ప్రజలకు సేవచేసే అవకాశం లభిస్తోందని రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం న్యూజివీడు పూర్వపు విద్యార్థి, ప్రస్తుత అల్లూరి సీతారాంరాజు జిల్లా అనంతగిరి ఎంపీడీవో శ్రీహర్షిత్ అన్నారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో శనివారం విద్యార్థులకు స్టూడెంట్ వెల్ఫేర్ విభాగం ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సన్నద్ధం, ఉద్యోగ అవకాశాలపై ప్రేరణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ, ఓఎస్‌డీ ఎల్.సుధాకర్‌బాబు, ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.



హర్షిత్‌ను అభినందిస్తున్న అధికారులు

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరం

అరసవల్లి: జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు జరిపిన అనంతరం వివరాలను తెలియజేయడం చట్టరీత్యా నేరమని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి అన్నారు. ఈ మేరకు చట్ట నిర్వహణ, అమలు తీరుపై స్థానిక కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 108 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, ప్రతి స్కానింగ్ సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి చట్టాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి పప్పల జగన్నాథం, ఏఎస్పీ తిప్పేస్వామి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.